క్లుప్తంగా

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

గుడివాడటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ప్రజాస్వామ్య రాజకీయాలకు మార్గ దర్శకుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం భట్టాచార్య మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.లక్ష్మణరావు, పి.రజిని, సీహెచ్ శివ, ఆర్.కొండ, జి.గోపాల్, బి.అరుణ, బీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేకుండా చూడాలి

మండవల్లి: బాల బాలికల మధ్య లింగ వివక్ష లేకుండా చూడాలని ఐసీడీఎస్ గన్నవరం సెక్టార్ సూపర్‌వైజర్ బి.ప్రసన్న అన్నారు. మిషన్‌శక్తి వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం పుట్లచెరువు సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్–1లో గురువారం నిర్వహించారు. పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ గురించి ఆమె వివరించారు. జీఎంఎస్‌కే ఎ.రజిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదని, బాల బాలికలనందరినీ చదివించాలని సూచించారు. హైస్కూల్ హెచ్‌ఎం మాట్లాడుతూ బాల బాలికలను సమానంగా చూడాలన్నారు. గన్నవరం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, ఉపాధ్యాయులు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనలో పీఆర్ చట్టం తప్పనిసరి

గుడ్లవల్లేరు: గ్రామ పంచాయితీ పరిపాలనలో 1994 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 45 తప్పనిసరిగా అమలుచేయాలని జిల్లా శిక్షణా మేనేజర్ అబ్బదాసరి ధర్మరాజు తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ధర్మరాజు మాట్లాడుతూ ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై తప్పనిసరిగా దృష్టి సారించాలన్నారు. గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి మాట్లాడుతూ 2024 –25 సంవత్సరానికి శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి అధికార, ప్రజా ప్రతినిధులకు మూడు రోజుల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ధర్మరాజును ఈఓపీఆర్డీ వి.దిలీప్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వడాలి పంచాయతీ కార్యదర్శికి సత్కారం

ముదినేపల్లి రూరల్: వడాలి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్‌ను స్థానిక ప్రముఖులు, పాలక వర్గ సభ్యులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది గురువారం సత్కరించారు. రమేష్ వడాలి, వైవాక గ్రామాల కార్యదర్శిగా పనిచేస్తూ గ్రేడ్–2 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొంది గుడివాడ రూరల్ మండలం శేరిగొల్వేపల్లికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

గుడ్లవల్లేరు: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో వేమవరంలోని పాడి రైతులకు గురువారం గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్ర మేనేజర్ తోట సత్యనారాయణ రూ.61,110 బోనస్ పంపిణీ చేశారు. ఇప్పటివరకు తమ గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్ర పరిధిలో రూ.54 లక్షల బోనస్‌ను అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తోట్లవల్లూరు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం జరిగింది. డీపీఓ నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, వీధిదీపాలు, పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సంపద సృష్టి కేంద్రాలను సమర్థంగా నడుపుతూ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యన్నారాయణ, కార్యదర్శి సత్యన్నారాయణ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంద్రాగస్టున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కైకలూరు: స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామ్‌ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు చెప్పారు. కై కలూరు ట్రావెలర్స్ బంగ్లాలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండలాధ్యక్షుడు కట్టా వీరరాఘవులు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి ప్రజల్లో జాతీయ స్ఫూర్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వేములవాడ వెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు బోయిన బాలాజీ, బొల్లా శ్యామలరాజు గౌడ్, వేంపాటి గోవింద చంద్రశేఖర్, నేరెళ్ళ చిన్ని కృష్ణ, బోడావుల రాజేష్, బోడావుల జగదీష్, అల్లూరి ప్రభుదాస్, పెరుగు భానుప్రకాష్ పాల్గొన్నారు.

నూతన కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

నిమ్మకూరు(పామర్రు): నూతనంగా ఎంపికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అందరూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలో నందమూరి లక్ష్మయ్య, వెంకట్రావమ్మ స్మారక గురుకుల పాఠశాలలో గురువారం ఎస్‌ఎంసీ కమిటీ ఎంపిక కార్యక్రమం జరిగింది. చైర్మన్‌గా ఎం.అంబేద్కర్‌ను, వైస్‌చైర్‌పర్సన్‌గా ఆర్.సాయి భవ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ దామచర్ల మధుసూదనరావు పర్యవేక్షించారు.

అడ్డాడలో...
మండలంలోని అడ్డాడ జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌గా జి.స్వప్న, వైస్ చైర్మన్‌గా బి.రాజేష్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పామర్రు ఎంఈవో -2 పద్మవాణి, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండిపర్రులో...
గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌గా పోలగాని పరసుకుమారి, వైస్ చైర్‌పర్సన్‌గా ఆరేపల్లి ప్రసన్న, సభ్యురాలిగా బొమ్మ నాగ రజినిని ఎన్నుకున్నారు.

నందివాడలో...
నందివాడ: మండలంలోని 13 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. మండలంలోని శ్రీ వేములపల్లి నాగయ్య జెడ్పీ హైస్కూల్ ఎన్నికల్లో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా బెజ్జవరపు కృష్ణవేణి, వైస్‌చైర్‌పర్సన్‌గా బొడ్డు పుష్పలీల ఎన్నికయ్యారు.

పాఠశాల కమిటీల ఎన్నికల నిర్వహణ పూర్తి
గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో 65 ప్రభుత్వ, ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహణ కమిటీల ఎన్నికలు గురువారం పూర్తయ్యాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని తహసీల్దార్ పి.మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.జగన్మోహనరావు, జి.గోపాలరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో...
తోట్లవల్లూరు: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 36 పాఠశాలలకు గానూ గరికపర్రు మండల పరిషత్, భద్రిరాజుపాలెం ఎంపీయూపీఎస్, మండల పరిషత్, బొడ్డపాడు ఎంపీయూపీఎస్, దేవరపల్లి జెడ్పీ పాఠశాల కమిటీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన చోట్ల చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికను నిర్వహించారు. ఎంఈఓ జి.వెంకటేశ్వరరావు, ఎంఈఓ(2) సురేష్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

మండవల్లిలో...
మండవల్లి: మండలంలోని పాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం నిర్వహించారు. మండలంలోని 7 హైస్కూళ్లు, 6 యూపీ స్కూళ్లు, 38 ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మండవల్లి హైస్కూల్‌లో విద్యాకమిటీ చైర్‌పర్సన్‌గా గంగనపల్లి కృష్ణవేణి, లింగాలలో బి.రవికుమార్, ఇంగిలింపాకలంకలో కె.రమ్య, లోకుమూడిలో ఎస్.బసవరాజు, చింతపాలలో ఎం.రజని, కానుకొల్లులో పి.మాధవి ఎన్నికయ్యారు. అయ్యవారిరుద్రవరం ఎంపీయూపీ పాఠశాలలో చైర్‌పర్సన్‌గా వట్టిప్రోలు విజయశాంతి ఎంపికయ్యారు.

ముదినేపల్లిలో...
ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలతో పాటు హైస్కూళ్లలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకొని కమిటీ సభ్యులతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతిజ్ఞలు చేయించారు.



నిమ్మకూరు గురుకుల పాఠశాల నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

గుడివాడరూరల్/గుడివాడటౌన్: ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించినట్లు ఎంఈవో బాలాజీ తెలిపారు. అర్బన్, రూరల్ మండలాల్లో మొత్తం 75 పాఠశాలలకు గాను 74 పాఠశాలలకు ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఎంఈవో తెలిపారు. తటివర్రు ఎంపీయుపీ పాఠశాలకు 8వ తరగతి కోరం లేక ఎన్నిక నిర్వహించలేదని చెప్పారు. పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలో గల అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఏజీకే ప్రైమరీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా వీఎన్.రాజ్‌కుమార్, వైస్ చైర్‌పర్సన్‌గా బి.సిమ్రాన్ ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.పాండురంగారావు తెలిపారు.

కైకలూరులో...
కైకలూరు: పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో గురువారం ముగిశాయి. మండలంలో మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలలకు గాను, 41 చోట్ల ఏకగ్రీవాలు, 19 చోట్ల ఎన్నికలు జరిగాయి. తహసీల్దారు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏలు పరిశీలకులుగా వ్యవహరించారు. కై కలూరు మండలం వదర్లపాడు ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా పరసా బేబీషాలిని, వైస్ చైర్‌పర్సన్‌గా గవర లక్ష్మీశైలజ ఎన్నికయ్యారు. హెచ్‌ఎం మారెళ్ళ రవిశంకర్ పర్యవేక్షణ చేశారు.

పమిడిముక్కలలో...
పమిడిముక్కల: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 58 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఎంఈఓ-2 శ్రీనివాస్ తెలిపారు. తాడంకి ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా వీరంకి రేవతి, వైస్ చైర్మన్‌గా కాండ్రు శేఖర్, కన్వీనర్‌గా హెచ్‌ఎం వై.శివనాగప్రసాద్, కోఆప్షన్ సభ్యులుగా ఏనుగ మురళి, పులి శ్రీనివాసరావులను ఎన్నుకొన్నారు. ఎన్నికలను అంగలూరు డైట్ లెక్చరర్ శ్రీనివాసాచార్యులు, ఎస్ఎస్ఏ ఏఎస్ఓ నగేష్, ఎంఈఓ–2 శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మొవ్వలో...
మొవ్వ: మండలంలోని జెడ్పీ, ఎంపీయూపీ,ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని 9 జెడ్పీ హైస్కూళ్లు, 3 ఎంపీయూపీ పాఠశాలలతో పాటు 49 మండల పరిషత్ పాఠశాలల్లో గురువారం విద్యా కమిటీలను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతీ సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి వారి ఆగమన మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా జరిగాయి. లక్ష తులసి పుష్పాలతో అర్చన చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ ఈవో మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గణపతి నవరాత్రుల రాటా ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం నవరాత్రి మహోత్సవ రాటా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కపిలవాయి గోపాల శాస్త్రి, ఆలయ ఉద్యోగులు శ్రీనివాస్, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల వేధింపులు ఆపాలి

టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ

గుడివాడరూరల్: టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల వేధింపులు ఆపాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. స్థానిక టిడ్కో కాలనీలో జరిగిన టిడ్కో లబ్ధిదారుల విస్తృత సమావేశానికి కమిటీ ఉపాధ్యక్షురాలు సయ్యద్ నూరున్నీసా గురువారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ లబ్ధిదారులను రుణాలు చెల్లించాలని బ్యాంకుల వారు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. బ్యాంకుల వేధింపులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం విచారించి 8,900 మంది లబ్ధిదారులకు టిడ్కో ప్లాట్లు కేటాయించిందని, కూటమి ప్రభుత్వం మళ్లీ విచారణ చేపట్టడాన్ని తాము అంగీకరించమన్నారు. ఒక్క పేరు తొలగించినా ఊరుకోమని హెచ్చరించారు. 600 మంది పిల్లలు ఉన్నా సముదాయం వద్ద స్కూల్ ప్రారంభించకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని, నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను వెంటనే ప్రారంభించాలని, సచివాలయ నిర్మాణాన్ని కూడా చేపట్టాలని, పిల్లలు ఆడుకోవడానికి పార్కు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సహాయ కార్యదర్శి ఎం.దుర్గ ఆదినారాయణ, సభ్యులు రంగారావు, అప్పలనాయుడు, మాధవి, వి.మేరమ్మ, రాజు, వై.నాగాంజనేయులు, బి.లక్ష్మి పాల్గొన్నారు.



టిడ్కో సముదాయం వద్ద సమావేశమైన అభివృద్ధి కమిటీ సభ్యులు

నిండుకుండలా కృష్ణమ్మ

తోట్లవల్లూరు: కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. తోట్లవల్లూరు వద్ద కృష్ణానది నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధికారులు దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రానికి 2.96 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో నదిలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగినట్లయింది. కృష్ణానదికి వరద రాకతో పాముల్లంక, తోడేళ్లదిబ్బ లంక, కాళింగదిబ్బలంక, తుమ్మలపచ్చిక లంక, పొట్టిదిబ్బలంక, కనిగిరిలంక గ్రామాల ప్రజలు, కరకట్ట వెంబడి గ్రామాల రైతులు, కూలీలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. తోట్లవల్లూరు వద్ద వరద తీవ్రతను ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు గురువారం రాత్రి పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టేవరకు రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



తోట్లవల్లూరు వద్ద నిండుకుండలా ఉన్న కృష్ణానది

గోతుల రోడ్లతో ప్రజల పాట్లు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రధాన రహదారులపై ఏర్పడ్డ పెద్దపెద్ద గోతులతో ఇటు ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అన్ని రహదారులు అధ్వానంగా మారి ప్రజల పాలిట ప్రాణాంతకంగా తయారయ్యాయి. వీటిపై ప్రయాణించే ప్రజలు, వాహనదారుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయింది. కొద్దిపాటి వర్షాలకే గోతుల్లో నీరు చేరి నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గురజ ప్రధాన సెంటర్లో పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు గాయాలపాలవుతున్నారు. వడాలి సెంటర్‌తో పాటు వడాలి నుంచి తామరకొల్లు వెళ్లే రోడ్డు చినకామనపూడి, నరసన్నపాలెం, గంగాపురం, చిగురుకోట సెంటర్లలో పెద్దపెద్ద గోతులు పడి వర్షాకాలంలో ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారులపై ఏర్పడ్డ గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గురజ సెంటర్లో బోల్తా కొట్టిన వ్యాను

కార్యాచరణ ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

పామర్రు: ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ప్రణాళికలతోనే పంచాయతీల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2024–25కు సంబంధించిన డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీవో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులు, గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన పనులు రూపొందించుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎం.భారతి మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శుల పాత్రలను, వారు చేయాల్సిన విధులను వివరించారు. కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కైకలూరు పట్టణ సీఐగా కృష్ణ



కై కలూరు: బదిలీల్లో భాగంగా కై కలూరు పట్టణ సీఐగా పి.కృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో విజయవాడలో విధులు నిర్వహించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆకుల రఘు రాజమండ్రి వెళ్లారు. నూతన సీఐ కృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ విధులు నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తదానం

గుడివాడ టౌన్: తలసేమియా బాధిత చిన్నారుల సంక్షేమం కోసం గురువారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ జీఎస్‌టీ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించినట్లు జీఎస్‌టీ సూపరింటెండెంట్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. డివిజన్‌లో మొత్తం 54 కేంద్రాలలో ఈ రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ఏఎన్నార్ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎం.జేసుబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలకుర్రులో తిరంగా ర్యాలీ

ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు గ్రామంలో కాశీనాథుని దుర్గాంబ, బుచ్చయ్య ట్రస్టు మానసిక దివ్యాంగుల విద్యార్థులతో గురువారం తిరంగా ర్యాలీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశం సుసంపన్నమై ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పోటీ పడుతూ ఆర్థికంగా, సాంకేతికంగా అగ్రగామి కావాలని ఆకాంక్షించారు. భారతదేశం మువ్వన్నెల జెండా ప్రపంచం గరిష్ఠంచేలా ఎగరాలని నినాదాలు చేస్తూ గ్రామ పురవీధులలో ర్యాలీలను నిర్వహించారు. ఈ ర్యాలీలో కేడీబీ ట్రస్టు డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ వై.ప్రసన్నకుమారి, దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వసుంధర, కళాశాల విద్యార్థులు, మానసిక దివ్యాంగులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో దేశభక్తి భావాన్ని ప్రేరేపించడంతో పాటు జాతీయ జెండా గురించి అవగాహన కల్పించేందుకు హర్ ఘర్ తిరంగ ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రముఖ్ బండారు వెంకటరాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక వేధింపులు పుస్తకావిష్కరణ

గుడ్లవల్లేరు: పిల్లలపై లైంగిక వేధింపులు అనే అంశంపై గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ రచించిన పుస్తకాన్ని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆవిష్కరించారు. పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపుల వలన సమాజంలో కలిగే ప్రభావాలు, దుష్పరిణామాలను ఈ పుస్తకంలో అమీనాబీ వివరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రూపొందించిన రక్షణ బిల్లులు, చట్టాలను ఇందులో పొందుపరిచినట్లు చెప్పారు. ఈ పుస్తకాన్ని సింగపూర్‌కు చెందిన స్ప్రింగర్ నేచర్ వారు ప్రచురించారు. పుస్తక రచయిత డాక్టర్ అమీనాబీ, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావును కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.



డాక్టర్ అమీనాబీ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ లక్ష్మణరావు

అధికారులు సమర్థంగా విధులు నిర్వహించాలి

పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో జ్యోతి

గుడివాడరూరల్: పంచాయతీల్లో అధికారులు సమర్థంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. గుడివాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాల్సిన విధులు, ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు నిర్వహించాల్సిన పాలనపై మూడు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికల తయారీ, వాటి పరిశీలన, తాగునీరు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాట్లు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు చేపట్టాల్సిన విధులు, చర్యల గురించి అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. ప్రజలకు ప్రభుత్వం తరపున అందనున్న సేవలు, సంక్షేమ పథకాల గురించి ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ త్రినాథరావు, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగించాలి

జెడ్పీ సీఈఓ ఆనందరావు

పమిడిముక్కల: గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని జెడ్పీ సీఈఓ ఆనందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మీ కంపోస్టు తయారు చేసి అవసరమైన వారికి విక్రయించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి 100 రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, వీధిదీపాల నిర్వహణ, పంచాయతీల విధులు, బాధ్యతలపై ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ, కార్యదర్శులు లక్ష్మి, అజయ్ శిక్షణ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఆనందరావు

పుల్లేరు కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

పమిడిముక్కల: 'వరి సాగుకు నీరేది?' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. పొక్లెయిన్ ఏర్పాటు చేసి మంటాడ నుంచి గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను పామర్రు సెక్షన్ ఏఈ ఎం.అరుణకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. రైవస్ కాలువలో మద్రివాడ, ఎగినపాడు వద్ద తూటుకాడ తొలగించామని, పుల్లేరు కాలువలో మంటాడ, గురజాడ గ్రామాల వద్ద పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టామని ఏఈ అరుణకుమార్ తెలిపారు. సాగునీటి ప్రవాహానికి ఏ విధమైన అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టామని తెలియజేశారు.



మంటాడ వద్ద పుల్లేరులో గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఏఈ అరుణకుమార్